క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మియాపూర్: మియాపూర్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఓల్డ్ ముంబాయి రోడ్డు ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు చందానగర్ మెయిన్ రోడ్డు, బీహెచ్ఇఎల్ ఏరియా, వేముకుంట, ఓల్డ్ ముంబాయి రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. దీనికి విద్యుత్ వినియోగదారులందరూ సహకరించాలని కోరారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో.. టమాట 25, పచ్చిమిర్చి 45, బెండ 60, కాకర 45, దొండ 40, దోస 50, ఆలు 20, చామ 100, కీర 30, బీర 50, వంకాయ 30, గోకర 45, బీన్స్ 50, బీట్‌రూట్ 30, క్యాప్సికమ్ 50, క్యాబేజీ 15, క్యారెట్ 30, చిక్కుడు 45, ఉల్లి 100 (5 కేజీలు), ములక్కాయలు (2) 10, కాలీఫ్లవర్ (1) 20, సొరకాయ (కేజీ) 20, అల్లం 80, వెల్లుల్లి 90.

సీఆర్ ఫౌండేషన్‌లో మహిళలకు ఉచిత శిక్షణ

హఫీజ్‌పేట్: కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్ నీలం రాజశేఖరరెడ్డి రీసర్చ్ సెంటర్‌లో ఉచితంగా మహిళలకు కంప్యూటర్ శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నారు. మహిళలకు స్వయం ఉపాధి కోసం టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మగ్గం, డైయింగ్, ప్రింటింగ్, బ్యూటిషియన్, స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్‌కు సంబంధించిన పరిజ్ఞానం, ట్యాలీ, డీటీపీ తదితర శిక్షణలు ఉచితంగా అందజేస్తున్నారు. మహిళలు మొదట అడిష్మన్ కోసం రూ.150లు చెల్లించాలి. సంవత్సరానికి నాలుగు బ్యాచ్‌లుగా, ఒకోక్క బ్యాచ్‌కు మూడు నెలల పాటు శిక్షణ కార్యక్రమం ఉంటుంది. ఒక బ్యాచ్‌లో సుమారు 100 మంది మహిళలు ఉంటారు. 15ఏళ్ల వయస్సు నుంచి 35 ఏళ్ల మధ్యలో గల చిన్నారులు, మహిళలు ఈ శిక్షణలో పాల్గొనవచ్చు.
మరిన్ని వివరాలకు కన్వీనర్ వనశ్రీ ఫోన్: 92465 30048లో సంప్రదించవచ్చు.

ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్..
సీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. మహిళల, కుటుంబ సమస్యలు ఉంటే ప్రత్యేకంగా ఫ్యామిలీ కౌన్సెలింగ్ కూడా తీసుకోవచ్చు. కన్వీనర్ వనశ్రీ నేతృత్వంలో ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు.

నేడు ఆర్ట్‌గ్యాలరీలో 'కంటి వెలుగు'

మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో బుధవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్ట్‌గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మి పేర్కొన్నారు. వృద్ధులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి కావాల్సిన కళ్లజోడులను ఇవ్వనున్నట్టు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

కాలభైరవ విగ్రహ ప్రతిష్ఠాపనకు విరాళం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్‌లో మంగళవారం శ్రీ కాలభైరవ విగ్రహ ప్రతిష్టాపనకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ రూ.2.50లక్షలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తున్నట్టు చెప్పారు. శ్రీ కాలభైరవ స్వామి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆయన కోరారన్నారు. ఆలయాలు, ప్రార్థన మందిరాల అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు.

నిరుపయోగం.. దుకాణ సముదాయం

- రూ.90 లక్షలతో నిర్మాణం
- వీధి వ్యాపారులకు కేటాయించని వైనం
- శిథిలావస్థకు చేరుతున్న స్టాల్స్


నిరుపయోగంగా వీధి వ్యాపారుల దుకాణ సముదాయం

చందానగర్: జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్ట్రీట్ వెండర్స్ షాప్స్ (వీధి వ్యాపారుల దుకాణ సముదాయం) అలంకారప్రాయంగా మారాయి. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన ఈ దుకాణాలు అధికారుల నిర్లక్ష్యం.. నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారాయనే విమర్శలు వెలువడుతున్నాయి.

- చందానగర్‌లో జాతీయ రహదారికి ఇరువైపులా సర్వీస్ రోడ్డు, మంజీరా రోడ్డులో చిరు వ్యాపారుల వల్ల ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. పార్కింగ్, రద్దీ సమస్యను అధిగమించడానికి జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో చందానగర్‌లోని హుడా కాలనీ ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ వద్ద వీధి వ్యాపారుల దుకాణ సముదాయాన్ని ఏడాదిన్నర క్రితం ప్రారంభించారు.
- చిరు వ్యాపారులకు అవగాహన కల్పించి ఈ ప్రాంతంలో వ్యాపారాలు చేసుకునే విధంగా అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ఇవి నిరుపయోగంగా మారాయి.
- ప్రస్తుతం దుకాణాల ప్రాంతంలో చెత్త దర్శనమిస్తోంది.అక్కడ మురుగు నిలిచి ఉండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఇక రాత్రి వేళల్లో ఆకతాయిలు, తాగుబోతులకు అడ్డాగా మారింది.
- అధికారులు సరైన ప్రణాళిక లేకుండా అనువైన స్థలాన్ని కేటాయించకపోవడంతో వ్యాపారులు ఇక్కడికి వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదని సమాచారం. ఈ వీధి వ్యాపారుల సముదాయం హుడా కాలనీవాసులకు మాత్రమే దగ్గరగా ఉంది.
- చందానగర్‌లోని ఎంఎంటీఎస్ రైల్వేస్టేషన్ అవతలి వైపు పాపిరెడ్డి కాలనీ, రాజీవ్ గృహకల్ప, సురభి కాలనీలు ఉన్నా రైల్వే పట్టాలు దాటి ఇక్కడకు రావడానికి జంకుతున్నారు.
- వివిధ కాలనీల్లో వారాంతపు సంతలు ఎక్కడపడితే అక్కడ నిర్వహిస్తుండడంతో స్థానికులు అక్కడే కొనుగోలు చేస్తున్నారు.
- హుడా కాలనీలో ఐదేళ్ల క్రితం మోడల్ మార్కెట్లు నిర్మించి వ్యాపారులకు కేటాయించకపోవడంతో ఈ మార్కెట్లు కూడా నిరుపయోగంగా పడి ఉన్నాయి.
- సుమారు 150 మంది వరకు కూరగాయలు, పాలు తదితర వ్యాపారాలు నిర్వహించుకోవచ్చు.
- వ్యాపారులను గుర్తించడం.. వారికి గుర్తింపు కార్డులు ఇవ్వడం కొత్త మార్కెట్‌లో స్టాల్స్ కేటాయించడంలో అధికారుల చిత్తశుద్ధి లోపించిందని ఆరోపిస్తున్నారు.
- చందానగర్ జాతీయ రహదారికి ఇరువైపులా సర్వీస్ రోడ్డు, మంజీరా రోడ్డులో అనేక మంది వ్యాపారాలు చేసుకుంటున్నారు. కాగా కొంత మంది వ్యక్తులు స్థలాలను ఆక్రమించి అద్దెకు ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోడ్ల పక్కన వ్యాపారాలు చేసుకునేవారు ఈ దుకాణ సముదాయానికి వస్తే ఇక్కడ మార్కెట్ నడవకపోతే గతంలో ఉన్న స్థలంలో కొత్తవాళ్లు వస్తే తమ పరిస్థితి ఏమిటని వారు భయాందోళన చెందుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలను ఎండగట్టాలి



గోపన్‌పల్లిలో మాట్లాడుతున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అప్రజాస్వామిక విధానాలను ఎండగట్టాలని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి బీజేపీ కార్యకర్తలు, నాయకులను కోరారు. 'ప్రజా గోస-బీజేపీ భరోసా' పేరిట స్ట్రీట్ కార్నర్ సమావేశాన్ని గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అవినీతిని ప్రజల ముందుకు తెచ్చేందుకే బీజేపీ 'ప్రజా గోస-బీజేపీ భరోసా' కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి వారు లబ్ధిపొందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో శక్తి కేంద్రాల ఇన్‌చార్జి హన్మంతునాయక్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో బీజేపీ గెలుపును ఎవరూ ఆపలేరు..
రాష్ట్రంలో బీజేపీ గెలుపును ఎవరూ ఆపలేరని బీజేపీ మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ ధీమా వ్యక్తం చేశారు. రాయదుర్గంలో శేరిలింగంపల్లి బీజేపీ ఇన్‌చార్జి గజ్జల యెగానంద్, స్థానిక నాయకుల ఆధ్వర్యంలో ప్రజాగోస-బీజేపీ భరోసా కార్యక్రమాన్ని సోమవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎప్పుడు రాష్ట్రంలో ఎన్నికల వచ్చినా బీజేపీ గెలువడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. శేరిలింగంపల్లిలో కూడా బీజేపీ జెండా ఎగురవేయాలని, నాయకులు, కార్యకర్తలంతా విభేదాలు పక్కన పెట్టి సమష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మూల అనీల్‌గౌడ్, గోవర్ధన్‌గౌడ్, రాఘవేందర్‌రావు, నీలం నరేందర్‌ముదిరాజ్, రవిందర్‌రెడ్డితోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి బాటలో గ్రామాలు



జిన్నారం(పటాన్‌చెరు): సీఎం కేసీఆర్ హయాంలో అభివృద్ధి బాటలో గ్రామాలు పయనిస్తున్నాయని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. గుమ్మడిదల మండలంలోని అన్నారం, గుమ్మడిదల, కానుకుంట గ్రామాల్లో రూ.45లక్షల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మంగళవారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి శంకుస్థాపనలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు గ్రామాల అభివృద్ధిని పూర్తిగా విస్మరించాయన్నారు. సీఎం కేసీఆర్ హయాంలో పల్లెల్లో ఎన్నడూ లేని అభివృద్ధి జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కుమార్‌గౌడ్, ఎంపీపీ ప్రవీణ, వైస్ ఎంపీపీ మంజుల, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

పటాన్‌చెరు: దేవాలయాల నిర్మాణాలకు ఎల్లప్పుడూ సహకరిస్తానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. క్యాసారం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయంలో నిర్వహించిన విగ్రహ ప్రతిష్టాపనకు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవాలయ నిర్మాణానికి రూ.10లక్షలు సాయం అందించినట్టు చెప్పారు. భవిష్యత్‌లో ఆలయ అభివృద్ధికి కూడా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, గౌడ సంఘం ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగు నీటికి ఇబ్బందుల్లేకుండా చూస్తాం

జిన్నారం(పటాన్‌చెరు): ఎండాకాలం సీజన్‌లో ప్రజలకు తాగు నీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు బొల్లారం మున్సిపల్ చైర్ పర్సన్ రోజారాణి అన్నారు. జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని మంగళవారం చైర్‌పర్సన్ రోజారాణి అధ్యక్షతన నిర్వహించారు. 2023 - 24 ఏడాదికి గాను రూ.43 కోట్ల అభివృద్ధి పనులకు కౌన్సిల్‌లో తీర్మానం చేశారు. అనంతరం మున్సిపల్ పరిధిలోని ఆయా కాలనీల్లో నెలకొన్న సమస్యలపై చర్చించారు. కాలనీల్లో నీటి సమస్యను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని కౌన్సిలర్‌లు కోరారు. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ రోజారాణి మాట్లాడుతూ ఎండాకాలం కావటంతో నీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. ఎండాకాలంలో అధిక మొత్తంలో నీటి కోసం నిధులను కేటాయిస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ పరిధిలోని అన్ని కాలనీలను అభివృద్ధి చేసేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్, ఆర్వో శ్రీధర్, కౌన్సిలర్లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధికి కట్టుబడి ఉంది


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధికి కట్టుబడి ఉందని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ఆయా డివిజన్ల నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే నివాసంలో చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు రంజిత్‌రెడ్డి, కార్పొరేటర్లు రాగం నాగేందర్‌యాదవ్, జగదీశ్వర్‌గౌడ్, దొడ్ల వెంకటేష్‌గౌడ్, జూపల్లి సత్యనారాయణ, నార్నె శ్రీనివాస్ రావు, ఉప్పలపాటి శ్రీకాంత్, సింధు ఆదర్శ్‌రెడ్డి, మంజులరఘునాథ్‌రెడ్డితో కలిసితో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి నియోజవర్గంలోని అన్ని డివిజన్ల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. డివిజన్‌లలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మాధవరం రంగరావు, మాజీ కౌన్సిలర్ మోహన్‌గౌడ్, గ్రంథాలయ డైరెక్టర్ గణేష్ ముదిరాజ్, ఆయా డివిజన్ల అధ్యక్షులు సంజీవరెడ్డి, రఘునాథ్‌రెడ్డి, సమ్మారెడ్డి, బాలింగ్ గౌతమ్‌గౌడ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

ప్రాణదాత.. క్రౌడ్ ఫండింగ్..



సాక్షి, సిటీబ్యూరో: క్రౌడ్ ఫండింగ్ అనారోగ్య చికిత్సలకు సంబంధించి ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్న రోగులకు ప్రాణదాతలా మారిందని ఆరోగ్య రంగ నిపుణులు అభిప్రాయపడ్డారు. కొండాపూర్‌లోని ఓ కో వర్కింగ్ స్పేస్‌లో క్రౌడ్ ఫండింగ్ అవగాహన శిబిరం జరిగింది. ఈ సందర్భంగా మిలాప్ క్రౌడ్ ఫండింగ్ ప్రతినిధి సందీప్ మాట్లాడుతూ.. వైద్యం అత్యంత ఖరీదుగా మారిన పరిస్థితుల్లో ఆదుకునే మార్గంగా మారిన క్రౌడ్ ఫండింగ్‌పై ప్రతీ ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు.

నా కూతురు బతికింది..
ఈ సందర్భంగా సూర్యాపేట్‌లో నివసించే సంతోష్ అనే చిరువ్యాపారి ఈ కార్యక్రమంలో పాల్గొని తన అనుభవాన్ని వివరించాడు. తన ఏడాదిన్నర వయసున్న కుమార్తెకు తీవ్రమైన వ్యాధి కారణంగా హైదరాబాద్‌కు తీసుకువచ్చామని, ఇక్కడి కార్పొరేట్ ఆస్పత్రిలో నెలన్నర పాటు సమయంతో పాటు రూ.30లక్షల వరకూ వ్యయం అవుతుందన్నారని చెప్పారు. తమకు ఉన్న వైద్యబీమా, సీఎం రిలీఫ్ ఫండ్ సహా మరెన్నో ప్రయత్నాలు చేసినా పావు వంతు మొత్తం కూడా సమకూరలేదన్నారు. ఆ సమయంలో మిలాప్ క్రౌడ్ ఫండింగ్ ద్వారా రూ.18లక్షలకు పైగా విరాళాలు అందాయన్నారు. ఆ డబ్బుతో కుమార్తె చికిత్స పూర్తయి ప్రస్తుతం పూర్తి ఆరోగ్యంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు క్రౌడ్ ఫండింగ్ లబ్ధిదారులు పాల్గొని తమ అనుభవాలు పంచుకున్నారు.

సీనియర్ సిటిజన్స్‌కు ఆట విడుపు అవసరం


కార్యాలయ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి: సీనియర్ సిటిజన్స్‌కు ఆట విడుపు అవసరమని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. మంగళవారం కొండాపూర్ డివిజన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్‌లో సీనియర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. యోగా క్షేమాలు మాట్లాడుకోవడం, చెస్, క్యారమ్ లాంటి ఆటలు ఆడుకునేందుకు వేదికగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రవీందర్ ముదిరాజ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు చాంద్ పాషా, జంగం గౌడ్, రాజేష్, సీనియర్ సిటిజన్లు నాగేశ్వర్ రావు, నర్సింహులు, బాలకృష్ణ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై మాక్ డ్రిల్

గచ్చిబౌలి: త్వరలో జీ-20 సదస్సు జరగనున్న నేపథ్యంలో ఐటీ కారిడార్‌లోని పలు స్టార్ హోటళ్లలో మాక్ డ్రిల్ నిర్వహించారు. రాయదుర్గం, మాదాపూర్ పీఎస్‌ల పరిధిలో జీ-20కి వచ్చే డెలిగేట్స్ బస చేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మంగళవారం నాలెడ్జ్ సిటీలోని ఐటీసీ కోహినూర్ హోటల్ రాయదుర్గం ఎస్‌హెచ్ఓ మహేష్ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాలపై మాక్ డ్రిల్ నిర్వహించారు. అగ్ని ప్రమాదం చోటు చేసుకుంటే తీసుకోవాల్సిన చర్యలపై సెక్యూరిటీ సిబ్బందికి వివరించారు. మంటలు ఆర్పడం, హోటల్ ఉన్న వారిని ఎలా అప్రమత్తం చేయాలని, బయటకు ఎలా రప్పించాలో వివరించారు.


మాక్ డ్రిల్‌లో నీటిని పిచికారీ చేస్తున్న హోటల్ సిబ్బంది

సర్వమత అవగాహనను పెంపొందించుకోవాలి


మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్

రాయదుర్గం: దేశంలో ఇస్లామిక్ అధ్యయనాల విభిన్న అంశాలను ప్రచారం చేయడంలో ముస్లిమేతర పండితులు, ముఖ్యమైన పాత్రను పోషించారని న్యూఢిల్లీ ఖుస్రో ఫౌండేషన్ చైర్మన్ పద్మశ్రీ అఖ్తరుల్ వాసే పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో 'ఇస్లామిక్ అధ్యయనాలకు భారతీయ ముస్లిమేతరుల సహకారం'అనే అంశంపై మంగళవారం జరిగిన జాతీయ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. లక్నోకు చెందిన మున్షీ నవల్‌కిషోర్ తన ప్రసిద్ధప్రెస్‌లో పవిత్ర ఖురాన్‌ను ముద్రించడమే కాకుండా మదర్సాలకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను కూడా అందించాడని గుర్తు చేశారు. మొదటి పర్షియన్ భాషా వార్తాపత్రిక ఇరాన్ నుంచి రాలేదని, కానీ కలకత్తా నుంచి రాజారామ్‌మోహన్‌రాయ్ ద్వారా ప్రచురించబడిందని గుర్తు చేశారు. వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ మాట్లాడుతూ.. విజ్ఞానం ఆధారంగా సర్వమత అవగాహనను పెంపొందించుకోవాల్సిన ఆవశ్యకతను వ్యక్తం చేశారు. ఇస్లామిక్ పండితుడు మౌలానా ఖలీద్‌సైఫుల్లా రహ్మానీ మాట్లాడుతూ.. భారతదేశంలోని ముస్లిమేతర పండితులు ఇస్లామిక్ అధ్యయనాల సహకారంతో గొప్ప పని చేశారన్నారు. ఖురాన్, న్యాయశాస్త్రం, ప్రవక్త జీవితచరిత్ర, నాట్ రచనల గురించి పెద్ద సంఖ్యలో రచనలు ఉన్నాయన్నారు. హిందూ-ముస్లింల మధ్య మెరుగైన సంబంధాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఐ డైరెక్టర్ డాక్టర్ ప్యాకియంటి శామ్యూల్, జామియా మీలియా ఇస్లామియా ఇస్లామిక్ స్టడీస్ విభాగం అధిపతి ఖాన్, ప్రొఫెసర్ షహీమ్ అక్తర్, ప్రొఫెసర్ మహ్మద్ హబీబ్, డాక్టర్ ఎండీ ఇర్ఫాన్ అహ్మద్ ప్రసంగించారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

శేరిలింగంపల్లి/రాయదుర్గం: జాతీయ విజ్ఞాన శాస్త్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని రాయదుర్గంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్‌కే తాజ్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ మోడల్స్ వర్కింగ్ మెడల్స్ చార్ట్‌లు టీఎల్ఎంలను 110 మోడల్స్‌ను విద్యార్థులు తయారు చేసి ప్రదర్శించారు. సైన్స్ ఉపాధ్యాయులు పావని, క్రాంతి, మమత, అమర్‌సింగ్, సుధీరా, కమలమ్మ, పాండు, గాంగ్యా, రాజేశ్వరి, అంజిలయ్య పాల్గొన్నారు.

నేటి బాలలే రేపటి సైంటిస్టులు..
జాతీయ విజ్ఞాన శాస్త్ర దినోత్సవాన్ని శ్రీచైతన్య పాఠశాల శేరిలింగంపల్లి శాఖలో నిర్వహించారు. ఈపీటీఆర్ఐ శాస్త్రవేత్త సునీల ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. నేటి బాలలే రేపటి సైంటిస్టులని వారి చిన్నతనంలో వినూత్నంగా ఆలోచించడం, నూతన అంశాన్ని నేర్చుకోవడంపై దృష్టి సారించేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. హెచ్ఎం వాణి ప్రసాద్, ఈపీటీఆర్ఐ అధికారులు అలీషా, మహ్మద్ ఖదీర్, లక్ష్మీనారాయణ, ఏజీఎం శివరామకృష్ణ, పద్మజ, మురళీకృష్ణ, అకడమిక్ డీన్ మురళీకృష్ణ, మాధవి పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి
గచ్చిబౌలి: విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని ప్లానిటరీ సొసైటీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ ఎన్.రంగనాథన్ సూచించారు. మంగళవారం గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. అనంతరం బి స్టూడియో ఆధ్వర్యంలో 'అడ్వంచర్ ఆఫ్ చిన్నారి' నాటికను ప్రదర్శించిన ఆకట్టుకున్నారు. ఎస్‌వీకే ట్రస్ట్ సాంబశివరావు, శ్రీనివాసరావు, విజయ్ కుమార్, రవిందర్, అనీల్, 250 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మెగా సైన్స్ ఎక్స్‌పో..
పంచభూతాల ఆకృతులు, పిండాభివృద్ధి నుంచి మానవ శరీర ఆకృతులు, ఎన్నో రకాల యంత్రాలు, పని ముట్ల ప్రదర్శన ఔరా అనిపించింది. మంగళవారం కొండాపూర్‌లోని రాఘవేంద్ర కాలనీలోని సంస్కృతి హైస్కూల్‌లో మెగా సైన్స్ ఎక్స్‌పో నిర్వహించారు. 160 స్టాల్స్‌లో వివిధ రకాల ప్రాజెక్ట్‌లను ప్రదర్శించిన విద్యార్థుల డ్యాన్స్‌లతో అదరగొట్టారు. విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు సైన్స్ ఎగ్జిబిషన్లు ఎంతగానో దోహదం చేస్తాయని శేరిలింగంపల్లి ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు భీష్మారెడ్డి పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి, కృష్ణ ప్రసాద్, వినోదిని, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.


శేరిలింగంపల్లి శ్రీచైతన్య పాఠశాలలో..


మెగా సైన్స్ ఎక్స్‌పో ప్రాజెక్ట్‌లు ప్రదర్శించిన విద్యార్థులు


గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో..

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గచ్చిబౌలి: గుర్తు తెలియని వాహనం ఢీకొని చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపిన ప్రకారం.. ఫిబ్రవరి 26న అర్ధరాత్రి 12.20 గంటలకు బయోడైవర్సిటీ జంక్షన్‌లో గుర్తు తెలియని వాహనం ఢీకొని వినోద్ (35నుంచి 40) కుడి కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. 108లో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారు జామున 4.20 గంటలకు మృతి చెందాడు. కేవలం తన పేరు వినోద్ అని మాత్రమే చెప్పి అపస్మారకస్థితిలోకి వెళ్లాడని, మిగతా వివరాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. సంబంధిత వ్యక్తులెవరైనా ఉంటే 79011 25526లో సంప్రదించాలని పోలీసులు సూచించారు.